

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 30-11-2025 | సంపుటి - 25 | సంచిక -193 | రూ : 4 | పేజీలు: 8




2లో

## రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు సర్పంచి స్థానాలకు 20 వేలు, వార్డు సభ్యులకు 50 వేలకు పైగా దాఖలు
- తొలి దశ పంచాయతీ ఎన్నికలు 11న... అదే రోజు ఫలితాలు

## వచ్చే పదేళ్ల అవసరాలు తీరేలా విద్యుత్ ప్రాజెక్టులు

- 2030 నాటికి మరో 6 వేల మెగావాట్లు అవసరం
- 2047 నాటికి గరిష్ఠ డిమాండ్‌లో 8 రెట్ల పెరుగుదల
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో



## టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో మరో 11 మంది పాత్ర



2లో

- కేసు విచారణను వేగవంతం చేసిన సిట్ అధికారులు
- తొలుత 15 మందిని, తర్వాత మరో 9 మందిని..
- తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేర్చిన సిట్



2లో

## బంగారం, వెండి ధరలకు రెక్కలు..

- రూ.1,29,820కి చేరిన 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం
- కిలో వెండిపై ఒక్కరోజే ఏకంగా రూ.9,000 పెరుగుదల
- మధ్య తరగతి వర్గాల్లో ఆందోళన పెంచుతున్న ధరలు

## రాష్ట్రానికి తలమానికంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



2లో

## ఢిల్లీకి ఊపిరాడట్లేదు..

### 15వ రోజూ ప్రమాదకరంగానే వాయు కాలుష్యం!

- వరుసగా 15వ రోజూ 'వెరీ పూర్' కేటగిరీలో ఢిల్లీ గాలి నాణ్యత
- శనివారం ఉదయం 338గా నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- రానున్న వారం రోజుల్లోనూ మెరుగుపడే అవకాశం లేదని అంచనా
- నోయిడా, ఘజియాబాద్‌లలో కూడా తీవ్రంగానే ఉన్న వాయు కాలుష్యం



2లో

## విశాఖ కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి..

### ప్రారంభానికి ముహూర్తం ఖరారు..

2లో

- కైలాసగిరిపై గాజు వంతెన.. డిసెంబర్ 1న ప్రారంభం
- పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచనున్న గ్లాస్ బ్రిడ్జి
- దేశంలోనే అత్యంత పొడవైన గాజు వంతెనగా రికార్డు
- జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న లామినేటెడ్ గాజుతో నిర్మాణం
- ఇది ఒకేసారి 500 టన్నుల భారాన్ని సైతం మోయగలదు



# ఎమ్మిగనూరు రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..

కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు వేగంగా ఢీకొన్న ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ హృదయ విదారక ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలియగానే సీఎం చంద్రబాబు స్పందించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు తక్షణమే అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ, రేంజ్ ఐజీ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతులంతా కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన వారని అధికారులు గుర్తించి సీఎంకు నివేదించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రానికి తలమానికంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

గ్రామ్మాజీపేట: కాజీపేటలో అత్యాధునికంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (ఆర్ఎంయూ) తెలంగాణకు తలమానికంగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అయోధ్యపురం వద్ద రూ.521 కోట్లతో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ నిర్మిస్తున్న ఆర్ఎంయూను ఆయన దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఇతర రైల్వే అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆర్ఎంయూ నిర్మాణంతో రాష్ట్ర చిరకాల స్వప్నం సాకారం కాబోతోందన్నారు. 2023లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయగా, మూడేళ్లలోనే ప్రధాన షెడ్ సహా 75% పనులు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఏడాది పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్ఎంయూలో 16 కోచ్‌ల మెమూ ర్యాక్‌లను తయారుచేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఆధునిక రీతిలో అనేక రకాల కోచ్‌లను కూడా ఇక్కడే తయారుచేస్తామని వెల్లడించారు. ''బీసీ రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకం కాదు. వీటిలో ముస్లింలకు పది శాతం కల్పించడం వల్ల చాలామంది బీసీలకు అన్యాయం జరుగుతుంది. ఎకరాకు పత్తి ఎంత దిగుబడి వచ్చిందో అంత మొత్తం సీసీఐ కొనుగోలు చేస్తుందని, ఇందుకు వ్యవసాయశాఖ అధికారి లేఖ ఇవ్వాల్సి ఉంటుంది'' అని కిషన్‌రెడ్డి తెలిపారు. తేమ శాతం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణం త్వరలోనే పూర్తిచేసి విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి తెలిపారు. వరంగల్ వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 280 ఎకరాల భూసేకరణ చేసి అప్పగించినందున పనులు ఇక వేగంగా సాగుతాయన్నారు. ముందుగా చిన్న విమానాలను నడుపుతామన్నారు. ప్రజల నుంచి వచ్చిన స్పందనను బట్టి దూర ప్రాంతాలకు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా దేశవ్యాప్తంగా ఎక్కడా జాతరలకు జాతీయ హోదా కల్పించడం లేదని అన్నారు. జాతర కోసం అవసరమైతే నిధులు సమకూరుస్తామని చెప్పారు.

### విశాఖ కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి..

## ప్రారంభానికి ముహూర్తం ఖరారు..

విశాఖ నగరవాసులు, పర్యాటకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కైలాసగిరి గ్లాస్ బ్రిడ్జి (గాజు వంతెన) ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. డిసెంబర్ 1వ తేదీన ఈ వంతెనను అధికారికంగా ప్రారంభించి, అదే రోజు నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ వంతెనను ఎంపీ ఎం. శ్రీభరత్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభిస్తారని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ, ఆర్‌జే అడ్వెంచర్స్ సంస్థలు సంయుక్తంగా రూ. 7 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టాయి. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే లక్ష్యంగా దీన్ని నిర్మించారు.

**గాజు వంతెన విహారం.. ప్రత్యేకతలివే!**

50 మీటర్ల పొడవుతో నిర్మించిన ఈ గాజు వంతెన, దేశంలోనే అత్యంత పొడవైన గ్లాస్ బ్రిడ్జిగా నిలవనుంది. ఇప్పటివరకు కేరళలోని 40 మీటర్ల వంతెన పేరిట ఈ రికార్డు ఉండేది. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, పలుమార్లు క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే దీనికి అనుమతులు ఇచ్చారు. బ్రిడ్జిపై ప్రవేశ రుసుమును ఇంకా ఖరారు చేయలేదని, ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రణవ్‌గోపాల్ వివరించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంలో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 40 ఎంఎం మందం గల లామినేటెడ్ గాజును ఉపయోగించారు. ఇది ఒకేసారి 500 టన్నుల భారాన్ని మోయగలదు. గంటకు 250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినా తట్టుకునేలా పటిష్ఠంగా నిర్మించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఒకేసారి 40 మంది పర్యాటకులను మాత్రమే బ్రిడ్జిపైకి అనుమతిస్తారు. వంతెనపై నుంచి చుట్టూ ఉన్న కొండలు, లోయ, సముద్రపు అందాలు వీక్షించడం పర్యాటకులకు థ్రిల్లింగ్ అనుభవాన్ని ఇస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

## రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల పర్వం

హైదరాబాద్: రాష్ట్రంలో 189 మండలాల్లోని 4,236 పంచాయతీలు, 37,440 వార్డులకు తొలిదశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పర్వం చివరి రోజైన శనివారం రాత్రి వరకు కొనసాగింది. వాస్తవానికి నామినేషన్ల దాఖలుకు సాయంత్రం ఐదు గంటల వరకే గడువు ఉంది. అయితే, పలు జిల్లాల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు సాయంత్రం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో 5 గంటల వరకు వచ్చిన వారందరి నుంచీ స్వీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి బాగా రాత్రయింది. సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు పార్టీల మద్దతుదారులు భారీ సంఖ్యలో దాఖలు చేశారు. చివరి రోజు సమర్పించిన నామినేషన్లకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి అర్ధరాత్రి వరకు కూడా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పూర్తి సమాచారం అందలేదు. శనివారం ఒక్కరోజే సర్పంచి స్థానాలకు 20 వేలకు పైగా, వార్డు సభ్యుల స్థానాలకు 50 వేలకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు సమాచారం. అధికారికంగా ఆదివారం వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. దాఖలైన నామినేషన్లను అధికారులు ఆదివారం పరిశీలిస్తారు. సాంకేతికంగా చెల్లుబాటయ్యే నామినేషన్ల వివరాలను ఆదివారమే ప్రకటిస్తారు. వాటిపై అప్పీళ్లను డిసెంబరు 1వ తేదీన స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 3వ తేదీ తుది గడువు. పోటీలో మిగిలిన అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను అదేరోజు వెల్లడిస్తారు. గ్రామపంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. తొలి దశ పోలింగ్ డిసెంబరు 11న నిర్వహిస్తారు. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

**రెండో విడతకు...**

డిసెంబరు 14న జరిగే రెండో విడత ఎన్నికలకు ఆదివారం నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 గ్రామపంచాయతీలు, 38,350 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మూడో విడత ఎన్నికలు డిసెంబరు 17న నిర్వహిస్తారు.

## వచ్చే పదేళ్ల అవసరాలు తీరేలా విద్యుత్ ప్రాజెక్టులు

హైదరాబాద్: రానున్న పదేళ్ల అవసరాలతో పాటు... 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యాలకు అనుగుణంగా కరెంటు డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని విద్యుత్ ప్రాజెక్టుల ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సౌర, పవన, థర్మల్ విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ పవర్... ప్రస్తుతం ఎంత ఉంది? లోటు ఎంత? వచ్చే పదేళ్లలో డిమాండ్ ఎంత పెరుగుతుంది? ఎంత లోటు ఏర్పడుతుంది? అనే అంశాలపై అధ్యయనం చేయించి కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) నివేదికతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను పరిగణనలోకి తీసుకుని డిమాండ్‌లో వృద్ధిని అంచనా వేసినట్లు చెప్పారు. దానికి తగ్గట్టుగా విద్యుదుత్పత్తి పెంపునకు చర్యలు తీసుకోకపోతే పారిశ్రామిక అవసరాలతో పాటు వ్యవసాయ, ఎత్తిపోతల పథకాలకు ఇబ్బంది కలుగుతుందని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర విద్యుత్ రంగంపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ బలరాం, జెన్‌కో, ట్రాన్స్‌కో, దక్షిణ డిస్కం సీఎండీలు హరీశ్, కృష్ణభాస్కర్, ముషారఫ్, రెడ్కో ఎండీ అనిలతో కలసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, కొత్త ప్రణాళికల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇందులోని ముఖ్యాంశాలు భట్టి మాటల్లోనే... ''దేశంలో విద్యుత్ డిమాండ్ వృద్ధి అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. గత దశాబ్ద కాలంలో రాష్ట్ర డిమాండ్ వార్షిక సగటు వృద్ధిరేటు సుమారు 9.77%. సీఈఏ అంచనాలు వాస్తవ వృద్ధిని ప్రతిబింబించడం లేదు. పెరుగుతున్న పట్టణీకరణ, డేటా సెంటర్ల ఏర్పాటు, విద్యుత్ వాహనాలు, సాగునీటి అవసరాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని... రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా అధ్యయనం చేసిన తర్వాత వాస్తవ అంచనాల ప్రకారం కనిష్ఠంగా డిమాండ్‌లో 8.5 శాతం వరకు వృద్ధి ఉంటుంది.

### ఢిల్లీకి ఊపిరాడట్లేదు..

## 15వ రోజూ ప్రమాదకరంగానే వాయు కాలుష్యం!



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వరుసగా 15వ రోజు కూడా గాలి నాణ్యత 'వెరీ పూర్' (చాలా తక్కువ) కేటగిరీలోనే నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) శనివారం ఉదయం 7 గంటలకు విడుదల చేసిన డేటా ప్రకారం, ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 338గా రికార్డయింది. శుక్రవారం నమోదైన 385 ఏక్యూఐతో పోలిస్తే ఇది స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. నవంబర్ నెలలో దాదాపు ప్రతీరోజూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. వాతావరణ పరిస్థితులు కాలుష్య కారకాలు చెదిరిపోవడానికి అనుకూలంగా లేనందున, రానున్న వారంలో కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని వాతావరణ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. శనివారం ఉదయం ఢిల్లీలోని ఆనంద్ విహార్ (354), అశోక్ విహార్ (347), బవానా (364), చాందినీ చౌక్ (351), ద్వారక సెక్టార్ 8 (368), ఐటీఓ (343) వంటి చాలా ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. అయితే ఐజీఐ ఎయిర్‌పోర్ట్ (295), దిల్షాద్ గార్డెన్ (272) వంటి కొన్ని చోట్ల మాత్రం గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో నమోదైంది. ఢిల్లీని ఆనుకుని ఉన్న ఎన్‌సీఆర్ నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నోయిడాలో ఏక్యూఐ 344, ఘజియాబాద్‌లో 333, గురుగ్రామ్‌లో 293గా రికార్డయింది. ఇదిలా ఉండగా, శనివారం పొగమంచు ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీల సెల్సియస్ వద్ద నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది.

## టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో మరో 11 మంది పాత్ర

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు విచారణను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) వేగవంతం చేసింది. ఈ కేసులో తాజాగా మరో 11 మందిని నిందితులుగా చేర్చింది. ఈ మేరకు నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రభుత్వం సిట్ కు అప్పగించిన విషయం విదితమే. ఈ కేసులో తొలుత 15 మందిని, ఆ తర్వాత 9 మందిని నిందితులుగా పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసులో మొత్తం 35 మందిపై కేసు నమోదు చేసి, పది మందిని అరెస్టు చేసింది. నిందితుల్లో ఏడుగురు టీటీడీ ఉద్యోగులు ఉండడం గమనార్హం. 20192024 మధ్య టీటీడీ కొనుగోలు విభాగంలో పనిచేసిన జీఎంలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను ఈ కేసులో చేర్చింది. సిట్ నిందితుల జాబితాలో గతంలో టీటీడీలో జీఎంగా పనిచేసిన జగదీశ్వర్ రెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### హైదరాబాద్ నుంచి వరంగల్‌కు

## వందే భారత్ రైల్లో ప్రయాణించిన కేంద్రమంత్రి



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ నుండి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి వరంగల్ చేరుకున్నారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో 'చాయ్ పే' చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. నగరంలో పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వరంగల్ విమానాశ్రయ పనులను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఇక్కడి నుండి తొలుత ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నామని, తర్వాత స్పందనను బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతామని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పామని అన్నారు. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చిందని, ఇందులో భాగంగా రామప్ప ఆలయ అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన అన్నారు.

### బంగారం, వెండి ధరలకు రెక్కలు..

## ఒక్కరోజే రికార్డు స్థాయిలో పెరుగుదల!

బంగారం, వెండి ధరలు పగ్గాలు లేకుండా పెరిగిపోతున్నాయి. ఈరోజు పసిడి, వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగిపోయి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరువయ్యాయి. ఈ ధరల పెరుగుదలతో సామాన్యులకు బంగారం, వెండి మరింత భారంగా మారనుంది. హైదరాబాద్ మార్కెట్‌లో ఈ ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,360 పెరిగింది. దీంతో దాని ధర రూ.1,29,820కి చేరింది. అదేవిధంగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1,250 పెరిగి, దాని తుది ధర రూ.1,19,000గా నమోదైంది. బంగారం ధరలను మించి వెండి ధర కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో కిలో వెండిపై ఒక్కరోజే ఏకంగా రూ.9,000 పెరిగింది. ఈ భారీ పెరుగుదలతో కిలో వెండి ధర రూ.1,92,000కు చేరింది. ప్రస్తుత ధరల సరళిని బట్టి చూస్తే, త్వరలోనే కిలో వెండి ధర రూ.2 లక్షల మార్కును కూడా దాటే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పండుగలు, శుభకార్యాలకు కొనుగోళ్లు చేయాలనుకునే మధ్యతరగతి వర్గాల్లో ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది.

## హోరాహోరీగా ముస్తాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికలు

**- అధ్యక్షునిగా లింగంపల్లి రాజేష్ ఎన్నిక**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: హోరాహోరీగా ముస్తాబాద్ ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షునిగా లింగంపెల్లి రాజేష్ (ప్రజాపక్షం), ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి సంతోష్ (ఇంక్విలాబ్ టీవీ), కోశాధికారిగా దొంతుల దినేష్‌లు ఎన్నికయ్యారు. ముస్తాబాద్ మండల పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేస్తామన్నారు. తమను ఎన్నుకున్నందుకు జర్నలిస్టులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్రమేని దేవేందర్(వెలుగు), దబ్బెడ రమేష్ (మన ప్రగతి), కర్ణాల శ్రీశైలం(చట్టం), దుబ్బాక శ్రీనివాస్ (మెట్రో ఈవినింగ్స్), ఏర్పుల రాజు (ప్రజాజ్యోతి), తుపాకుల సంతోష్ (వార్త), జంగ బాలకిషన్ ( ఎవన్ఎన్ 24న్యూస్) పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని చాటిన దివ్యాంగులు

*** ఉల్లాసంగా జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు ప్రగతి మైదానం కొత్తగూడెం నందు జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా జెండా ఊపి, బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. దివ్యాంగులు అందరితో సమానంగా అన్ని క్రీడలలో రాణించాలని, జిల్లా నుండి రాష్ట్ర, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో ఆటల పోటీల్లో రాణించాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వము జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తారని, దివ్యాంగులు ప్రతిరోజూ ఆటలు ఆడడం ద్వారా వారిలో మానసికొల్లాసంతో పాటు శారీరక సామర్థ్యం, ఆత్మ స్థైర్యం పెరుగుతుందని, దివ్యాంగులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని కొనియాడారు. షాట్ పుట్ లో సందీప్, అనిత, అఖిల్, సాయి కౌశిక్, రవి, జావెలిన్ త్రో లో రవి, సావిత్రి, అఖిల్, మోక్షిత్, రన్నింగ్ లో సందీప్, అనిత, అఖిల్, నాగరాజు, హేమంత్ చౌదరి, క్యారమ్ బోర్డు లో శైలు, సందీప్, ప్రవీణ్, రాజు ప్రథమ స్థానంలో గెలుపొందారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మశ్రీ, పి.ఈ.టి.లు నరేష్, మంగీలాల్, మదన్, బావ్ సింగ్, జిల్లా దివ్యాంగుల సంఘాల నాయకులు సతీష్, నయీం, ప్రవీణ్, రాజేందర్, ముజాహిద్దీన్, దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలల నిర్వాహకులు ప్రసాద్, అరుణ, నాగలక్ష్మి, గౌతమి, సుబ్బ లక్ష్మీ, కార్యాలయ సిబ్బంది వర ప్రసాద్, నాగేశ్వర రావు, నరేష్, ప్రవీణ్, దివ్యాంగులు , తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు గూడెం స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి గా దూపటి లక్ష్మీ వెంకటేష్ నామినేషన్ దాఖలు



ఆలేరు, ప్రజా స్ఫూర్తి : ఆలేరు మండలం తూర్పు గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్ జనరల్ మహిళగా ఉండడంతో ధూపటి లక్ష్మీ వెంకటేష్ ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో సర్పంచ్ మహిళ అభ్యర్థిగా నామినేషన్ వేసినారు. గ్రామ అభివృద్ధి ధ్యేయంగా గ్రామ ప్రజలు ఆశయాల సాధనకై ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద మనుషులు, నాయకులు చంద్రగిరి బాలయ్య, దూపటి లింగమయ్య, అందె అంజయ్య,కాట ఎన్నయ్య,బాల స్వామి, జోసెఫ్ , స్టార్విన్ , సురేష్ గ్రామ మహిళ సంఘాలు యువజన సంఘాలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## సైబర్ క్రైమ్ బారినపడిన భాధితుడిని కాపాడిన సైబర్ సెక్యూరిటీ

*** బ్యాంక్ అఫ్ బరోడా మేనేజర్‌ను సత్కరించిన డీఎస్పీ అశోక్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:సైబర్ క్రైమ్ బాధితుని గుర్తించి, అతని రూ. 5 లక్షల నగదును కాపాడిన బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఐ.నరేందర్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ భద్రాద్రి కొత్తగూడెం సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పి బి.అశోక్, సిఐ సముద్రాల జితేందర్‌లు బ్యాంకు మేనేజర్‌ను సత్కరించారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని గుర్తించిన బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగూడెం బ్రాంచ్ సిబ్బంది, మేనేజర్ నరేందర్ కొత్తగూడెం సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సైబర్ బ్యూరో సిబ్బంది బాధితుడిని చేరుకుని, కౌన్సిలింగ్ నిర్వహించి, అతడు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్న రూ. 5 లక్షలను కాపాడడం జరిగింది. బాధితునికి 10 రోజుల క్రితం టెలిగ్రామ్ యాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్ కి సంబంధించి సైబర్ నేరగాళ్లు ఒక మెసేజ్ రూపంలో ఇన్వెస్ట్మెంట్ యాప్ లింకును పంపి, యాప్‌లో పెట్టుబడి పెడితే డబ్బు రెండు మూడు రెట్లు అవుతాయని చెప్పారు. బాధితుడు అది సైబర్ నేరస్తుల పన్నాగమని గ్రహించక, లింకు ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, మొదట రెండు విడుతలుగా రూ.10 వేలు, రూ.20 వేలు పెట్టుబడులు పెట్టాడు. సైబర్ నేరగాళ్లు బాధితున్ని నమ్మించడం కోసం మొదటగా చెప్పినట్లుగా అతనికి రెండు విడతల్లో డబ్బును రెట్టింపు చేసి రూ.20 వేలు ఒకసారి, రూ.40 వేలలు మరోసారి యాప్ అకౌంట్లో డిపాజిట్ చేశారు. ఆ డబ్బును అతడు విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. సైబర్ నేరగాళ్లను పూర్తిగా నమ్మిన బాధితుడు ఆ తరువాత రూ.3.85 లక్షలు ఆ యాప్ లో పెట్టుబడి పెట్టగా, రూ. 7 లక్షలు వచ్చినట్లుగా, వాటిని విత్ డ్రా చేసుకోవడానికి మరో రూ.5 లక్షలు డిపాజిట్ చేసి మొత్తం రూ.16 లక్షలు విత్ డ్రా చేసుకోవచ్చని నమ్మించారు. ఆ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో సైబర్ నేరగాళ్లకు సంబంధించిన మరికొంతమంది వ్యక్తులు తమకు అట్టి యాప్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం ద్వారా అత్యధిక లాభాలు వస్తున్నట్లు కొన్ని ఫేక్ బ్యాంక్ ట్రాన్సాక్షన్లను మెసేజ్‌ల ద్వారా పోస్ట్ చేపిస్తూ బాధితుడిని నమ్మించారు. దీంతో బాధితుడు 16 లక్షలు రూపాయలు డబ్బులు వస్తాయనే అత్యాశతో ఇంట్లో బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా, కొత్తగూడెం బ్రాంచ్‌లో తాకట్టు పెట్టి రూ.5 లక్షలు సైబర్ నేరస్తులకు చెందిన రాజస్థాన్ బ్యాంక్ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయడానికి అదే బ్యాంక్ అధికారులను సంప్రదించాడు. పెద్ద మొత్తంలో డబ్బులు వేరే రాష్ట్రానికి చెందిన అకౌంట్ కి ట్రాన్స్‌ఫర్ చేస్తుండడంతో అనుమానం వచ్చిన బ్యాంక్ సిబ్బంది, మేనేజర్ నరేందర్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు సమాచారం ఇచ్చారు. బ్యాంకుకు సిబ్బంది బాధితున్ని విచారించి జరుగుతున్న మోసాన్ని వివరించి రూ.5 లక్షలు నగదు ట్రాన్స్‌ఫర్‌ను అడ్డుకున్నారు. అంతకుముందే బాధితుడు సైబర్ నేరగాళ్లకు పంపిన రూ.3,85,000/- గురించి సైబర్ క్రైమ్ నమోదు చేసి పోయిన నగదును రిఫండ్ చేసే కార్యాచరణను సైబర్ సెక్యూరిటీ అధికారులు చేపట్టారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి తక్షణమే స్పందించిన బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగూడెం బ్రాంచ్ సిబ్బందిని, బ్రాంచ్ మేనేజర్ నరేందర్‌ను కొత్తగూడెం జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పి బి.అశోక్, సిఐ ఎస్ జితేందర్‌లు అభినందించారు.

*** యాప్‌లలో పెట్టుబడులు పెట్టవద్దు: డీఎస్పీ అశోక్**

ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్, వాట్సప్, ఇంటర్నెట్, సోషల్ మీడియా యాప్, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్, స్టాక్ మార్కెట్, షేర్ మార్కెట్‌కి సంబంధించిన మోసపూరిత ప్రకటనలను పంపిస్తూ సైబర్ బాధితులను రెట్టింపు లాభాన్ని పొందవచ్చని అత్యాశను కల్పిస్తూ నమ్మిస్తున్నారని, ఆ విధమైన మోసాలకు బలి కావద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిఎస్పీ అశోక్ తెలిపారు. సైబర్ నేరాలలో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారస్తులు లక్షలు, కోట్లలో పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారని, సైబర్ నేరాలలో బాధితులు పోగొట్టుకుంటున్న నగదు 90 శాతం ఇలాంటి మోసాలలోనే కోల్పోతున్నారని, కాబట్టి బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, బిజినెస్ నిపుణులను ప్రత్యక్షంగా కలుసుకొని సలహాలు తీసుకొని, ఇన్వెస్ట్మెంట్ చేసే కంపెనీల గురించి విచారణ చేపట్టిన తర్వాత ముందుకు వెళ్లడం ద్వారా ఇలాంటి నేరాలను అరికట్టవచ్చని తెలిపారు.

## వికారాబాద్ లోని అగస్త్య విద్యాలయంలో ఘనంగా 'గ్రాండ్ పేరెంట్స్' ఆత్మీయ సమ్మేళనం

వికారాబాద్, (ప్రజాస్ఫూర్తి) : పాఠశాల అంటే కేవలం పాఠాలు నేర్పించే చోటు మాత్రమే కాదు, సంస్కారాలను నేర్పే దేవాలయం అని వికారాబాద్ లోని ఆగస్త్య విద్యాలయం నిరూపించింది.శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'గ్రాండ్ పేరెంట్స్ టీచర్ మీటింగ్' (తాతయ్య, నానమ్మ/అమ్మమ్మల ఆత్మీయ సమావేశం) అందరినీ ఆకట్టుకుంది. సాధారణంగా పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు (పీటీఎం) జరుగుతుంటాయి. కానీ, విద్యార్థుల సమగ్ర వికాసంలో వృద్ధుల పాత్రను గుర్తిస్తూ ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం విశేషం.ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై, న్యూక్లియర్ ఫ్యామిలీల సంస్కృతి పెరిగింది. దీనివల్ల చాలామంది పిల్లలు తమ తాతయ్య, నానమ్మల ప్రేమానురాగాలకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో 'గ్రాండ్ పేరెంట్స్' ప్రాముఖ్యతను పిల్లలకు, సమాజానికి తెలియజేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. పుస్తకాల్లో దొరకని ఎన్నో జీవిత పాఠాలు, నీతి కథలు, కుటుంబ విలువలు కేవలం ఇంట్లోని పెద్దల ద్వారానే పిల్లలకు అందుతాయి. తల్లిదండ్రులు ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉన్నప్పుడు, పిల్లలకు సరైన మార్గనిర్దేశం చేయగలిగేది ఇంట్లోని పెద్దలేనని ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల యాజమాన్యం గుర్తుచేసింది.నేటి తరం పిల్లలు ఎక్కువగా ఫోన్లకు, టీవీలకు అతుక్కుపోతున్నారు. వారిని గ్యాడ్జెట్ల ప్రపంచం నుంచి బయటకు తెచ్చి, తాతయ్యల ఒడిలో కథలు వినేలా, వారితో సమయం గడిపేలా ప్రోత్సహించడంలో ఈ మీటింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం చాలా ముఖ్యం. ఆ సంస్కారం వారి మూలాల నుంచే



వస్తుంది. వృద్ధాప్యంలో ఉన్న పెద్దలను గౌరవించడం, వారిని ప్రేమగా చూసుకోవడం వంటి విషయాలను పిల్లలు నేర్చుకోవాలన్నదే మా తపన" అని పాఠశాల ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న వృద్ధులు, తమ మనవలు, మనవరాళ్లతో కలిసి ఆనందంగా గడిపారు. పాఠశాల తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## వాహనదారుడిపై టిప్పర్ డ్రైవర్ ఉమ్మివేత

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్ సెంటర్ వద్ద శనివారం వెర్రి చేష్టలతో ఓ టిప్పర్ డ్రైవర్ దుమారం రేపాడు. రుద్రంపూర్ దిశగా వెళ్తున్న బొగ్గు టిప్పర్ డ్రైవర్ నోట్లో ఉన్న పాన్ గుట్కాను రోడ్డుపై ఉమ్మగా పక్కనే వెళ్తున్న వాహనదారుడిపై నేరుగా పడింది. వెంటనే ఇద్దరు రోడ్డుమీదే వాగ్వాదానికి దిగారు. అదే సమయం అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు టిప్పర్‌ను ఆపి విషయం తెలుసుకున్నారు. గుట్కా నిషేధం ఉన్నా డ్రైవర్లు పాన్ మసాలా, గుట్కా, అంబర్ వంటివి నోట్లో వేసుకొని వాహనాలు నడపడం రోజువారీ అలవాటైపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు ఆటో, కార్లు, డీసీఎంలు, బస్సులు, బొగ్గు టిప్పర్ల డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేస్తూ పక్కన వెళ్లే వాహనదారులు, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలాంటి అసభ్య ప్రవర్తనపై ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## చారిత్రాత్మక వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: డిసెంబర్ 2న సీఎం ఏనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శనివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.మధ్యాహ్నం 2 గంటలకు ఐడిఓసి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో సీఎం ల్యాండింగ్ ఉండనుండగా, అక్కడ పరిశుభ్రత, భద్రత, గ్రీన్ రూమ్ వాహనం, సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్టేట్ చాంబర్ వద్ద పరిశుభ్రత పనులు పూర్తి చేసి, వీఐపీల రవాణా కోసం మినీబస్సులు సిద్ధం చేయాలని, దీనిని పాల్వంచ తహసీల్దార్ పర్యవేక్షించాలని సూచించారు. శిలాఫలకం వద్ద పూల అలంకరణ, గ్రీన్ మ్యాట్, వేదిక ఏర్పాట్లు వీఐపి ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. యూనివర్సిటీ చరిత్రను ప్రతిబింబించే ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని, ఉదయం విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించి




సాంస్కృతిక కార్యక్రమాలను సిద్ధం చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్లు సిద్ధంగా ఉంచాలని, వైద్యశాఖ హెలిపాడ్-సభా ప్రాంగణంలో అంబులెన్సులు, అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంతర్గత రహదారుల మరమ్మత్తులు, భవనాల వైట్‌వాష్ పనులను పంచాయతీ శాఖ అత్యవసరంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేదిక, సౌండ్ సిస్టమ్, రహదారి పనులు నాణ్యత ప్రమాణాలతో చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. సభకు వచ్చే ప్రజలు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలని, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థుల రవాణా కోసం రవాణా శాఖ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల భోజన ఏర్పాట్లను మహిళా సంఘాల సభ్యులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ విద్యా చందనను ఆదేశించారు. సభా ప్రాంగణంలో పుట్టగొడుగుల పెంపకం, సోలార్ డ్రైయర్, లైవ్లీహుడ్ ప్రాజెక్టు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని అనుమతులు రేపటిలోగా, ఏర్పాట్లు డిసెంబర్ 1 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, అధికారులు కలిసి శిలాఫలకం పరిసరాలు, సభా ప్రాంగణం, రవాణా మార్గాలను పరిశీలించారు.

*** భద్రత కట్టుదిట్టం – ఎస్పీ రోహిత్ రాజు**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోపం లేకుండా మూడు విభాగాలు ఇంటెలిజెన్స్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కాన్వాయ్ మార్గం, సభా ప్రాంగణం, వేదిక వద్ద బలగాలను మోహరించామని చెప్పారు. ప్రజల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ డైవర్షన్లు అమల్లోకి రానున్నాయని తెలిపారు.సమీక్షలో అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 20వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు దాచేపల్లి రాజుఅనిత, దాచేపల్లి ఆకాష్, దాచేపల్లి విజయ్‌కావేరి, ఆదిత్య, ఉద్వితలు శనివారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్, దాసరి మురళిస్వామి, వంగూరి శ్రీను, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, అందోజు సన్నిధ్ చారి, అప్పిడి శేఖర్ రెడ్డి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగ సత్యనారాయణ భారీ ర్యాలీతో నామినేషన్



యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లాపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగ సత్యనారాయణ నామినేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా మల్లాపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంగ సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ఎన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ముందుకు సాగుతుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు,మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్లా ఐలన్న మన గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు సిసి రోడ్లు సహకారంతో మన గ్రామాన్ని ఇంకా అభివృద్ధి పథంలో నడిపిస్తానని కావున నన్ను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఘనంగా దీక్షా దివస్

*** మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ' దీక్ష దివస్ ' సందర్భంగా భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించి, కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి , ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ళ శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య , మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ మీ, మాజీ జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి,ఏనుగుల రాకేష్ రెడ్డి, కల్లూరి రామచంద్ర రెడ్డి, చింతల వెంకటేశ్వర రెడ్డి , బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక దారుఢ్యం...

- **ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి...**
- **మాజీ కౌన్సిలర్, షటిల్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిబాబు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: మానసిక సైర్యానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, యువకులు క్రీడాస్ఫూర్తితో స్నేహపూర్వకంగా క్రీడలలో పాల్గొనడం ఆనందించదగ్గ విషయమని మాజీ మున్సిపల్ కౌన్సిలర్, షటిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.చిట్టిబాబు ముదిరాజ్ అన్నారు. శనివారం జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అందోలు తాలుకా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తాయని. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. కబడ్డీ వంటి జట్టు ఆటలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందిస్తాయన్నారు. ప్రతి ప్లేయర్ శిక్షణను నిరంతరం కొనసాగించాలన్నారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారం పెరుగుతాయని, పోటీలు అనంతరం కూడా క్రీడలపై ఆసక్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. మైదానంలో శాంతి, క్రమశిక్షణ పాటించాలని, అంపైర్ల నిర్ణయాలను గౌరవించాలని క్రీడాకారులను అన్నారు. క్రీడా రంగంలో మెరుగైన అవకాశాలు పెరుగుతున్నందున లక్ష్యాన్ని నిర్దేశించి క్రమంగా సాధన చేస్తే తప్పకుండా మంచి భవితవ్యాన్ని నిర్మించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ తుడుం యాదయ్య కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జె.ప్రసాద్ కుమార్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు

# సుభాష్ నగర్ మాజీ సర్పంచ్ అదృశ్యం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలం సుభాష్ నగర్ పంచాయితీ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, వల్లాల మంగమ్మ శుక్రవారం రాత్రి నుంచి కనబడటం లేదు. భర్త వల్లాల నరసయ్య తెలిపిన వివరాల ప్రకారం.మాజీ సర్పంచ్ ప్రస్తుత సర్పంచ్ అభ్యర్థి వల్లాల మంగమ్మ శుక్రవారం రాత్రి అదృశ్యమైంది. శుక్రవారం రాత్రి నుంచి తన ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని తమ బంధువుల తెలిసిన వాళ్ళ ఇళ్లల్లో సైతం చూసామని ఆచూకీ తెలియడం లేదంటూ పేర్కొన్నారు. శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్ లో సైతం మిస్సింగ్ కేస్ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.సర్పంచ్ అభ్యర్థిగా సైతం పోటీ చేయనున్న వల్లాల మంగమ్మ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 03వ తేదీ నామినేషన్ వేసే క్రమంలో అనుమానాస్పదంగా కనిపించకపోవడం సర్వత్ర ఆశ్చర్య అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ అదృశ్యమైందనే విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్ చార్జి మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ సుభాష్ నగర్ లోని మంగమ్మ ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులు సైతం మంగమ్మ ఆచూకీ తెలియకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు హరిప్రియ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో వల్లాల మంగమ్మ గెలుపు ఖాయమని ఈ నేపథ్యంలో రాజకీయంగా ఏమైనా కుట్రలు జరుగుతున్నాయా అనే విషయంపై ఇల్లెందు మండలంలో సర్వత్ర చర్చనీయాంశమైంది. ఏది ఏమైనా వల్లాల మంగమ్మ మిస్సింగ్ విషయంపై పోలీసులు సైతం విచారిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే రాజకీయ ఎత్తుగడల్లో భాగంగా వల్లాల మంగమ్మను బెదిరింపులకు గురిచేసినట్లయితే ఉపేక్షించేది లేదంటూ ఎంతటి ఎవరికైనా పోరాటం చేస్తామని పూర్తి వివరాలతో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.




# ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమాగౌరి**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఉమాగౌరి అన్నారు. డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ డే ను పురస్కరించుకుని శనివారం నీలిమ ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సస్, అనురాగ్ యూనివర్సిటీ వారి సహకారం తో ర్యాలీ , అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె తో పాటు టీబీ, హెచ్ఐవి, ఎయిడ్స్ అండ్ లీప్ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ శ్రీదేవి లు పాల్గొని జిల్లా లో చేపడుతున్న కార్యక్రమాలు , హెచ్ఐవి, ఎయిడ్స్ స్థితి గురించి వివరించారు. కాలేజీ డీన్ డాక్టర్ లక్ష్మి ప్రసన్న మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య వారు మా కాలేజ్ లో ఈ కార్యక్రమం చేయడం, విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ పైన అవగాహన కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ ఉమాగౌరి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని,కమ్యూనిటీ స్థాయి లో అందరికి విస్తృతంగా హెచ్ఐవి పట్ల అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎయిడ్స్పై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలో ఎయిడ్స్ బారిన పడేవారి సంఖ్య తగ్గించగలమని చెప్పడం జరిగినది.ఈ అవగాహనా విషయం లో ఫీల్డ్ సిబ్బంది, ఐసీటీసీ, ఎన్జీఓ ల సేవలు అభినందనీయం అని తెలియజేసారు. అనంతరం హెచ్ఐవి. ఎయిడ్స్ పైన పోస్టర్ మేకింగ్, వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు, హెచ్ఐవి. ఎయిడ్స్ కార్యక్రమంలో ప్రతిభ కనపరచిన ఐసీటీసీ స్టాఫ్, ఎన్జీఒలను మొమెంటోస్ and సర్టిఫికెట్స్ తో సత్కరించారు. చివరగా హెచ్ఐవి ఉచిత ఇండియా అనే ప్రతిజ్ఞ తో , ఐఈసీ ఎక్షిభిషన్ స్టాల్స్ విజిట్ తో ఈ కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ లావణ్య, వసంత రెడ్డి, నారపల్లి మెడికల్ అఫిసర్ శోభన, డిపిఎంఓ సింహారాజ్, మేడికల్ కాలేజ్ విద్యార్థులు, స్టాఫ్, , ఇంజనీరింగ్ విద్యార్థులు, ఐసీటీసీ ఫెసిలిటేటర్స్ , ఎన్జీఒ లు, స్టాఫ్ పాల్గొన్నారు.



# నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్ ది

*** టి ఎస్ టి ఎస్ మాజీ చైర్మన్ పార్టీ మీద జగన్మోహన్ రావు**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్ ది అని టి ఎస్ టి ఎస్ మాజీ చైర్మన్ పార్టీ మీద జగన్మోహన్ రావు అన్నారు. దీక్షా దివాస్ సందర్భంగా శివానంద హాస్పిటల్ లో పండ్ల పంపిణీ చేయడం జరిగింది రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు కూకట్పల్లిలో ఉన్న జేఎన్టీయూ హెచ్ విశ్వవిద్యాలయంలో దీక్ష దివాస్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టి ఎస్ టి ఎస్ మాజీ చైర్మన్ పార్టీ మీద జగన్మోహన్ రావు హజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పింది. సరికొత్త చరిత్రకు నాంది పలికిందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసింది.'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసిఆర్ దన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన కెసిఆర్ దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు నా గుండెలో పదిలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణ్ అక్షయ్ చైతన్య యాదవ్ మహేష్ సంతోష్ యాదవ్ దుర్గా అజయ్ శ్రవణ్ రమేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజెయూ) పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా లో భాగంగా శనివారం సాయంత్రం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం వద్ద టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబు లు పాల్గొని డిసెంబర్ 3వ తేదీన చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమ కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పత్రికల సమస్య లు కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఐజెయూ సభ్యులు మాతంగి దాస్ చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, కోశాధికారి అజాంఖాన్, రాష్ట్ర నాయకులు ఇక్బాల్, ఉస్మాన్ రషీద్, బాలకృష్ణ, అహ్మద్ అలీ,మురళి,వెంకటయ్య, అఫ్రోజ్, అమాన్, మోసిన్ అలీ,గౌస్, రియాసత్, ఇలియాజ్, అంజాద్, అన్వార్, శ్రీనివాస్, జాన్ షహీద్, ఖాసీం,ప్రకాష్, అసద్, ల తో పాటు ఉర్దూ పత్రిక, ఇంగ్లీష్ పత్రిక , తెలుగు పత్రిక సంపాదకులు,తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష- దివాస్ వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది

* **కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు.**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : దీక్ష దివాస్ వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయం నందు దీక్ష దివాస్ సందర్భంగా పార్టీ జెండాని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గండి మైసమ్మ చౌరస్తాలోని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం కు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజా దేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకి ఇవాళ శుభకరమైన రోజని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఎన్నో ఏళ్లుగా కష్టపడిన రానీ తెలంగాణను కెసిఆర్ 2001లో పార్టీని స్థాపించి ఉద్యమం నడిపించి తెలంగాణ ప్రజలందరికీ ఏకతాటిపైకి తీసుకువచ్చి 29 నవంబర్ 2009 దీక్ష చేపట్టి తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదం తోటి ప్రారంభించి పది రోజులు దీక్ష చేయడం వలన ఆరోజు ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణని గత్యంతరం లేని పరిస్థితిలో 9 డిసెంబర్ 2009 నాడు తెలంగాణ నీ ప్రకటించిందన్నారు. 2 జూన్ 2014 రోజు నా తెలంగాణను ఏర్పాటు చేసి ప్రజలకు విముక్తి కలిగించిన దాంట్లో కేసీఆర్ విజయం సాధించడం జరిగిందన్నారు. ఈరోజు తెలంగాణ ప్రజలు మర్చిపోలేని రోజు అలాగే ఇప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అలాంటి పరిస్థితులను తెలంగాణ ప్రజలకి చూపిస్తున్నారు కావున మరొకసారి తెలంగాణ ప్రజలందరూ కూడా కేసీఆర్ వైపు ఉండి మళ్లీ కేసీఆర్ ని ముఖ్యమంత్రినీ చేసుకునే విధంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ, జగదీష్‌గౌడ్, రామచందర్, రవీందర్ రావు, నరసింహారెడ్డి, మోహన్ రావు, మల్లయ్య, శేఖర్, బండప్ప, యాదగిరి, ప్రవీణ్, బాబు, విక్రమ్, చిన్న, సోమేష్ ,అరవింద్, రవి, మోహన్ చారి, శ్రీనివాస్, జై, కుమార్, వెంకటేశ్వరరావు, సంతోష్, నవీన్, హరి, అనిల్, ప్రవీణ్, మల్లేష్, నవీన్ చారి, వెంకట్, మహేష్, మురళి, సతీష్, రామ్మూర్తి, సాయి, రాము, మాధవి రెడ్డి, శైలజ, రాధిక, కరుణ, తదితరులు పాల్గొన్నారు.



## గొలనుకొండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఇందూరి యాదగిరి రెడ్డి భారీ ర్యాలీతో నామినేషన్



ఆలేరు , ప్రజాస్ఫూర్తి : ఆలేరు మండలం సారాజిపేట గ్రామంలో గొలనుకొండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఇందూరి యాదగిరి రెడ్డి భారీ ర్యాలీతో నామినేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది ఈ సందర్భంగా గొలనుకొండ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఇందూరి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ముందుకు సాగుతుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు,మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్లా ఐలన్న మన గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు సిసి రోడ్లు సహకారంతో మన గ్రామాన్ని ఇంకా అభివృద్ధి పథంలో నడిపిస్తానని కావున నన్ను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ని మరో మారు సీఎం ని చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలి

* **మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమం..**



కుత్బుల్లాపూర్, , (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షా దివాస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం ఏర్పాటు చేసిన దీక్షా దివాస్ కార్యక్రమంలో మాజీ మంత్రి ఏమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణా రావు, బండారి లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ లు పాల్గొని మాజీ సీఎం కెసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ ని మరో మారు సీఎం ని చేసేవరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ప్రభుత్వంతో పోరాటం చేస్తుంది

* **టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ప్రభుత్వంతో పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు అన్నారు. కూకట్పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కేపీహెచ్బీ కాలనీ రోడ్డు నంబర్ 1లోని మహాత్మగాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన జర్నలిస్ట్ మహా ధర్నా కర పత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మామిడాల రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ. ఎన్నికల సమయంలో జర్నలిస్టులను మచ్చిక చేసుకోవడానికి కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఎన్నికల అనంతరం పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, గత రెండు ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇస్తామని ప్రకటించిన విధంగా జర్నలిస్టులకు అందవలసి హక్కులను, సంక్షేమ ఫలాలను అందించేలా చూడలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు రావలసిన హక్కుల కోసం డిసెంబర్ 3వ తేదిన సమాచార శాఖ కార్యాలయం ముందు పెద్ద మొత్తంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా క్రమశిక్షణ కమిటి కన్వీనర్ పరమేష్, కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఏ. కరీమ్, జిల్లా నాయకుడు పి. గంగరాజు, సామాల రాము, చంద్రకుమార్, హరిబాబు, కావురి ప్రవీణ్, సాగర్ రెడ్డి, రాజు, వెంకటేష్, రాకేష్, హరి, అంబటి వెంకట్, హరికృష్ణా, ఆనంద్, చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్, పవన్, మారుతి సాగర్, సోమిరెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్‌లో సెయింట్ మేరీస్ విద్యార్థుల ప్రతిభ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొత్తగూడెం పట్టణం పోస్టాఫీస్ సెంటర్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ 2025-26లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆరోగ్యం-పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, వ్యర్థ నిర్వహణ అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న నమూనాలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. జూనియర్స్ విభాగంలో 'కార్బన్ ప్యూరిఫికేషన్' మోడల్‌తో పాల్గొన్న 7వ తరగతి ఎం.డి.అమతుల్లా సారా ద్వితీయ బహుమతి సాధించింది. ఈ ప్రాజెక్ట్‌కు సి హెచ్.సవిత గైడ్ టీచర్‌గా మార్గనిర్దేశం చేశారు. 8వ తరగతి విద్యార్థి ఎస్. శారూన్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్‌తో ప్రశంసలు అందుకోగా గైడ్ టీచర్‌గా కె. స్రవంతి వ్యవహరించారు. సీనియర్ విభాగంలో 'స్మార్ట్ సిటీ - వ్యర్థ నిర్వహణ' శీర్షికతో 9వ తరగతి విద్యార్థిని భూమిక మూడో బహుమతి దక్కించుకుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంధ్య గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణపై 'లెట్స్ గ్రీన్ అవర్ ఎన్విరాన్మెంట్' మోడల్‌ను రూపొందించిన 6వ తరగతి విద్యార్థిని నైనిక రజువా ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. నైనికను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. గైడ్ టీచర్‌గా సిహెచ్. సవిత ఉన్నారు. విద్యార్థులు చూపిన సృజనాత్మకత, శ్రద్ధ ప్రశంసనీయమని పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రూబి, సిస్టర్ నిర్మల అభినందించారు.

## కాలికి శస్త్రచికిత్స.. సర్జికల్ బ్లేడ్ మర్చిపోయి కుట్లు వేసిన వైద్యులు

తుని:కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వెలుగు చూసింది. ఓ యువకుడి కాలికి శస్త్రచికిత్స చేసిన వైద్యులు.. సర్జికల్ బ్లేడ్ మర్చిపోయి కుట్లు వేశారు. తుని మండలం ఎస్.అన్నవరం పంచాయతీ పరిధిలోని రామకృష్ణా నగర్‌కు చెందిన చిన్నా.. ఏడాదిన్నర క్రితం విశాఖలో కాలి గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ సమయంలో కాలులో స్టీల్ రాడ్డు, స్క్రూ వేశారు. ఇటీవల ఇబ్బందిగా ఉండటంతో స్క్రూ తొలగించాలని తుని ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు శస్త్రచికిత్స చేసి దాన్ని తొలగించారు. ఆ సమయంలో శస్త్రచికిత్సకు వినియోగించే బ్లేడును కాలు లోపల ఉంచేసి కుట్లు వేశారు. ఆ తర్వాత ఎక్స్‌రేలో బయటపడటంతో బాధితుడు ఆందోళన చెంది మళ్లీ వైద్యులను సంప్రదించాడు. దీంతో మరోసారి ఆపరేషన్ చేసి ఆ బ్లేడును తొలగించారు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు.



## 'దిత్వా' తుపానుపై హోం మంత్రి అనిత సమీక్ష

అమరావతి: 'దిత్వా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తుల ప్రతిస్పందన సంస్థ కార్యాలయంలో హోం మంత్రి అనిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలెర్ట్ చేయాలన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి.. ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపించాలని ఆదేశించారు. రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్ష సూచన ఉందని అధికారులు వివరించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అధికార యంత్రాంగం అనుక్షణం అలర్ట్‌గా ఉండాలని సూచించారు.



## రెండో విడత అమరావతి భూసేకరణ చంద్రబాబుకు షర్మిల సూటి ప్రశ్నలు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. అమరావతి రాజధాని కోసం రెండో విడత భూసేకరణ చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఇది రియల్ ఎస్టేట్ మాఫియాను తలపిస్తోందని ఆరోపించారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా?" అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉందని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. తొలి విడతలో ప్రభుత్వ భూములతో కలిపి 54 వేల ఎకరాల్లో అభివృద్ధి జరిగిపోయిందని చంద్రబాబు భ్రమల్లో ఉన్నారు. రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో ఒక్క కిలోమీటర్ నిర్మాణం కూడా జరగలేదని, ఐకానిక్ భవనాల ఊసే లేదని విమర్శించారు. అలాంటిది ఇప్పుడు కొత్తగా మరో 16 వేల ఎకరాలు ఎందుకని నిలదీశారు. అదానీ, అంబానీలకు బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. దేశంలోని అతిపెద్ద విమానాశ్రయాలు, అంతర్జాతీయ క్రీడా నగరాలతో పోలుస్తూ అమరావతికి వేల ఎకరాలు ఎందుకని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు. ముంబై విమానాశ్రయానికి 1850 ఎకరాలు, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 2200 ఎకరాలు సరిపోయినప్పుడు, అమరావతికి 5 వేల ఎకరాలు అవసరమా అని అడిగారు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల్లోనే ఉండగా, ఇక్కడ 2500 ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. రాజధాని భూములపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. రెండో విడత భూసేకరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణం విభజన హామీలో భాగమని, అది కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడగకుండా శాలువాలు కప్పి సన్మానాలు చేయడం ఏంటని ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు.





## కంటైనర్‌లో మంటలు.. ప్రాణాలతో బయట పడిన డ్రైవర్, క్లీనర్

ఇచ్ఛాపురం గ్రామీణం: కొనిసి జాతీయ రహదారి 16పై ఆంధ్రా నుంచి ఒడిశావైపు వెళ్తున్న కంటైనర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వాహనం పూర్తిగా దగ్ధమైంది. అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పంచాయతీ పోరు.. రాత్రిపూట కొనసాగుతున్న నామినేషన్లు

తాండూరు గ్రామీణ: వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో సర్పంచి, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ రాత్రి 7గంటలు దాటినా కొనసాగుతోంది. జినుగుర్తి క్లస్టర్ కేంద్రంలో జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి, ఉదండాపూర్, గుండ్లమడుగుతండా, మైసమ్మతండా అభ్యర్థులు, సిరిగిరిపేటలో అల్లాపూర్, సిరిగిరి పేట్, వీరారెడ్డిపల్లి, రాంపూర్, రాంపూర్ తండాకు చెందిన అభ్యర్థులు నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పిస్తున్నారు. పదుల సంఖ్యలో అభ్యర్థులు ఉండటంతో రాత్రి 9 గంటల వరకు ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. సాయంత్రం 5గంటలకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామపత్రాల దాఖలుకు అనుమతిస్తున్నారు.

*** సిద్ధాపూర్ కేంద్రంలో బారులు తీరిన అభ్యర్థులు**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ కేంద్రంలో సాయంత్రం 6 గంటలు దాటినా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామపత్రాలు దాఖలు చేసేందుకు అభ్యర్థులు వరుసలో ఉన్నారు. సాయంత్రం 5గంటల లోపు వాచ్చిన వారికి అధికారులు టోకెన్లు జారీ చేశారు.







## కేబీఆర్ పార్క్ వద్ద ఆటోమేటిక్ స్మార్ట్ పార్కింగ్ సేవలు ప్రారంభం

హైదరాబాద్: కేబీఆర్ పార్క్ వద్ద ఆటోమేటిక్ స్మార్ట్ పార్కింగ్ సేవలు ప్రారంభమయ్యాయి. పీపీపీ పద్ధతిలో జీహెచ్ఎంసీ నిర్మించిన తొలి పార్కింగ్ కేంద్రాన్ని మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. "కేబీఆర్ పార్క్‌కు వచ్చిన వారంతా రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. 405 చ.మీ విస్తీర్ణంలో మల్టీలెవల్ స్మార్ట్ పార్కింగ్ ఏర్పాటు చేశాం. ఇందులో ఒకేసారి 72 కార్లు పెట్టొచ్చు. 4 నెలలుగా కార్లను పార్కింగ్ చేస్తూ ట్రయల్‌రన్ చేశాం. భవిష్యత్తులో జీహెచ్ఎంసీ పరిధిలోని 30 ప్రాంతాల్లో మల్టీలెవల్ స్మార్ట్ పార్కింగ్ సెంటర్లు నిర్మిస్తాం" అని మేయర్ తెలిపారు.

## స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలు.. ముఠా అరెస్టు



హైదరాబాద్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలో ఇద్దరిని అరెస్టు చేయగా.. వారిలో ప్రధాన నిందితుడు రవికుమార్‌తో పాటు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సమకూరుస్తున్న శివేంద్ర అశోక్ సింగ్ ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి ట్రేడింగ్ పేరుతో రూ.12.30 లక్షలు మోసం చేసినట్లు సమాచారం. నిందితులపై దేశవ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

## అమృత్ పథకం కింద వరంగల్‌కు రూ.874 కోట్లు



**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

వరంగల్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. "వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించాం. ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నాం. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పాం. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోంది" అని కిషన్‌రెడ్డి వివరించారు.

## విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలి

**: భట్టి విక్రమార్క**

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, భవిష్యత్ అవసరాలపై భట్టి మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. విద్యుత్ డిమాండ్ సన్నద్ధతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. " 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెరగాలి. 2047 నాటికి లక్ష మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. విద్యుత్



స్టోరేజ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు చేయలేదు. విద్యుత్‌ను బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్‌ల్లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో 12 ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పాయింట్లకు అవకాశం ఉంది" అని భట్టి అన్నారు.

## దీక్షా దివస్ పేరుతో BRS డ్రామాలను ప్రజలు విశ్వసించరు

**: మంత్రి సీతక్క**

హైదరాబాద్: BRS అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే దీక్షా దివస్ పేరుతో BRS నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు.



"తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ధి పొందింది కేసీఆర్ కుటుంబమే. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో BRS చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరు" అని మంత్రి అన్నారు.

**నాంపల్లి కోర్టుకు హాజరైన సీతక్క**

కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

## అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదు: సజ్జనార్

నాగోల్, ప్రజాస్ఫూర్తి: దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు మెమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ ఉద్యమగతిని మలుపుతిప్పిందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నాటి ఆమరణ దీక్ష తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసిందన్నారు. " 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టారు. 'తెలంగాణ వచ్చుడోకేసీఆర్ సచ్చుడో' నినాదంతో ఉద్యమం చేపట్టారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేశారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసేందుకూ




సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్‌ది. తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్" "నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రం లేదు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యం" అని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన కేసీఆర్ దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు తన గుండెలో పదిలంగా ఉన్నాయంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

## వైర్‌లెస్ సిటీగా హైదరాబాద్.. అండర్‌గ్రౌండ్ కేబులింగ్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

వైర్‌లెస్ సిటీగా హైదరాబాద్ మారనుంది. నగరంలోని ప్రధాన మెట్రో జోన్లలో ఉన్న పై ఎలక్ట్రిక్ లైన్లను పూర్తిగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్‌కు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రాజెక్టును ఆమోదించింది. ఈ ప్రాజెక్ట్ ఖర్చు రూ.4,051 కోట్లుగా నిర్ధారిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్ సర్కిళ్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాయి. TGSPDCL రూపొందించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (DPR) ప్రకారం మొత్తం 3,899 కి.మీ నిడివి గల 33kV, 11kV, LT లైన్లు అండర్‌గ్రౌండ్ కేబుల్స్‌గా మారనున్నాయి. దీంతో నగరంలో విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయత పెరగడంతో పాటు నిర్వహణ వ్యయాలు గణనీయంగా తగ్గనున్నాయని ప్రభుత్వం తెలిపింది. కాగా, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే నగరంలో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, నిరంతరంగా అందుతుందని




ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా వర్షాకాలంలో సంభవించే లోపాలు, ప్రమాదాలు, నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశముంది.

## జంప్ పాలిటిక్స్ కొంత కాలమే బాగుంటుంది.. లాంగ్ పాలిటిక్స్ లో అది సాధ్యం కాదు

కాంగ్రెస్ లో ఇప్పుడు ఉన్నత స్థానంలో ఉన్న అనేక మంది నేతలు గతంలోఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ లలో పని చెసినవారే, ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ లలో పని చేస్తే కాంగ్రెస్ లో మంచి భవిష్యత్ ఉంటదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.



యూత్ నాయకులు గ్రౌండ్ లో పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని, గ్రామాలలో పనిచేస్తే ప్రజల నాడీ తెలుస్తుందని ఆయన సూచించారు. శనివారం గాంధీ భవన్ ప్రాంగణంలోని ఇందిరా భవన్ లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ నేతలు, జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విత్ ఐవైసి యాప్, పలు అంశాలపై నేతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ సర్పంచ్ లెవెల్స్ లో, ఎంపీపీ, జడ్పీటీసీల్లో కూడా పోటీలో ఉండాలన్నారు.

# దిత్వా ఎఫెక్ట్.. శ్రీలంకలో 123కి పెరిగిన మృతుల సంఖ్య

దిత్వా తుపాను కారణంగా శ్రీలంకను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో ఇక్కడ ఇప్పటివరకు 123 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా అనేకమంది ఆచూకీ తెలియాల్సి ఉంది. విపత్తు నిర్వహణ కేంద్రం శనివారం ఓ ప్రకటనలో ఈ విషయాలు వెల్లడించింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయని పేర్కొంది. ఈ క్రమంలో 43వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని డీఎంసీ జనరల్ డైరెక్టర్ సంపత్ తెలిపారు. రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. శుక్రవారం కెలాని నది ఒడ్డు మునిగిపోయింది. వందలమందిని తాత్కాలిక పునరావాసాలకు తరలించామని వెల్లడించారు. వారితో పాటు అక్కడ ఉన్న మిగిలినవారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై కసరత్తు



చేస్తున్నట్లు తెలిపారు.

**ఆపరేషన్ సాగర్ బంధు..**

ఇదిలాఉండగా.. దిత్వా తుపాను కారణంగా అతలాకుతలమైన శ్రీలంకకు భారత వైమానిక దళం అండగా నిలిచింది. 'ఆపరేషన్ సాగర్ బంధు' అని పేరుతో పొరుగుదేశానికి భారత్ ఈ సాయం చేపడుతుంది. 'దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో విధ్వంసకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అక్కడ సహాయక చర్యలు చేపట్టేందుకు భారత్ ఆపరేషన్ సాగర్ బంధు ప్రారంభించింది' అని ఐఏఎఫ్ ఓ పోస్టులో రాసుకొచ్చింది. శుక్రవారం రాత్రే హిండన్ ఎయిర్‌బేస్ నుంచి రెండు విమానాల్లో 21 టన్నుల నిత్యావసర సరకులు, శానిటరీ సామగ్రి. అత్యవసర పరికరాలతో బయలుదేరాయి. శనివారం తెల్లవారుజామున కొలంబోలోని బండరునాయకే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఇవి ల్యాండ్ అయ్యాయి. అక్కడి భారత రాయబార కార్యాలయం, శ్రీలంక వైమానిక దళం అధికారులకు వీటిని అప్పగించారు.



# ప్రభుత్వ టీచర్ ఫార్ములాకు..

## ప్రపంచ వేదికపై ప్రశంసలు!

రత్లాం: మధ్యప్రదేశ్‌లోని రత్లాంకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గజేంద్ర సింగ్ రాథోడ్ రూపొందించిన విద్యా బోధన విధానాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. అబుధాబీలో జరిగిన ప్రపంచ విద్యా సదస్సులో ఈయన రూపొందించిన 'సైకిల్ ఆఫ్ గ్రోత్' ఫార్ములా, బోధనా పద్ధతులు ప్రశంసలు అందుకున్నాయి. ఈ ఫార్ములా కింద ప్రార్థన నుంచి క్రీడల వరకు రోజువారీ పాఠశాల కార్యకలాపాలను విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల శిక్షణ, రోజువారీ బ్రెయిన్‌స్ట్రామింగ్ సెషన్‌లతో మొదలయ్యేది. ఇందులో ఉపాధ్యాయులు రోల్ ప్లేల ద్వారా బోధనా పద్ధతులను మెరుగుపరుచుకున్నారు. ముఖ్యంగా, ఉపాధ్యాయుల బోధనా పద్ధతులపై డేటా సేకరణ, విద్యార్థుల రోజువారీ అభ్యసన వృద్ధి విశ్లేషణ ఆధారంగా ప్రతి విద్యార్థికి వ్యక్తిగత ప్రణాళికలు రూపొందించారు. దీని ఫలితంగా ఆ పాఠశాల 9 నుంచి 12వ తరగతి వరకు 100 శాతం ఫలితాలు సాధించింది. ప్రపంచంలోని అత్యుత్తమ ఇన్నోవేటివ్ పాఠశాలల్లో ఒకటిగా నిలిచింది. ఈ ఫార్ములా ఆధారంగా రాసిన పుస్తకాన్ని సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు విడుదల చేశారు.

# దిత్వా తుపాను.. తమిళనాడు హై అలర్ట్

దిత్వా తుపాను కారణంగా తమిళనాడులోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు తుపాను కదులుతున్న నేపథ్యంలో ఆయా విభాగాలు అప్రమత్తమయ్యాయి. భారీ వర్షాల కారణంగా తమిళనాడులో అనేక విమాన సర్వీసులు రద్దు కావడంతోపాటు స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే ఇండిగో ప్రయాణికులకు సూచన చేయగా, తాజాగా ఎయిరిండియా కూడా విమాన సర్వీసుల ప్రభావంపై అడ్వైజరీ జారీ చేసింది.

**54 విమానాలు రద్దు..**

భారీ వర్షాల కారణంగా వివిధ



జిల్లాలకు నడిచే 54 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు చెన్నై ఎయిర్‌పోర్ట్ వెల్లడించింది. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా చెన్నై సహా దక్షిణాది నగరాల నుంచి రాకపోకలు సాగించే విమాన సర్వీసులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఎయిర్ ఇండియా అడ్వైజరీలో పేర్కొంది. ఎయిర్‌పోర్టుకు బయలుదేరే ముందు విమాన సర్వీసు స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. అంతకుముందు ఇండిగో కూడా ఇదే విధమైన అలర్ట్ విడుదల చేసింది. వర్షాల నేపథ్యంలో దక్షిణ రైల్వే కూడా అప్రమత్తమైంది. భారీ వర్షం, ఈదురు గాలులతో రామేశ్వరంలోనూ రెండో రోజు జనజీవనం స్తంభించింది. రామనాథపురం, నాగపట్నంలలో వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. తుపాను తీరం దాటే సమయంలో చెన్నైలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సహా 28 విపత్తు ప్రతిస్పందన దళాలను రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించింది. ప్రభావిత జిల్లాల్లో 6వేల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వైమానిక, కోస్ట్‌గార్డ్ కూడా అప్రమత్తంగా ఉన్నాయి. తుపాను కారణంగా శ్రీలంక అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.



# దిల్లీ పేలుడు కేసు..

## అల్ ఫలా వర్సిటీలో రూ.18 లక్షలు స్వాధీనం!

దిల్లీ: దిల్లీ పేలుడు కేసులో 'జాతీయ దర్యాప్తు సంస్థ' విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసుకు కేంద్రంగా మారిన అల్ ఫలా యూనివర్సిటీలో ఇటీవల అధికారులు సోదాలు చేశారు. కీలక నిందితురాలైన షాహీన్ షహీద్ ఉన్న గదిలో దాదాపు రూ.18 లక్షల నగదు దొరికినట్లు విశ్వసనీయ వర్గాలను పేర్కొంటూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ నగదు మొత్తాన్ని 'వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్' కార్యకలాపాల కోసం ఉపయోగించేందుకే దాచినట్లు తెలుస్తోందని ఆంగ్ల మీడియా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎన్ఐఏ అధికారులు ఈ నిధుల మూలాల కోసం అన్వేషణ మొదలుపెట్టారు. ఈ క్రమంలో షాహీన్ ఎవరెవరినీ సంప్రదించిందనే అంశంపైనా దృష్టి సారించారు. తద్వారా ఈ పూర్తి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు యత్నిస్తున్నారు.

# కుర్చీ సమరం వేళ.. సిద్ధూ, డీకే బ్రేక్‌ఫాస్ట్ మీట్..!



కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ లు శనివారం ప్రత్యక్షంగా భేటీ అయ్యారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇరువురి నేతలు బ్రేక్‌ఫాస్ట్‌కు సమావేశమయ్యారు. ఈ సమావేశం కోసం ఈరోజు ఉదయం డీకే, సిద్ధరామయ్య నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఇరువురి నేతలు కొంతసేపు ముచ్చటించుకున్నారు. అనంతరం ఇరువురూ కలిసి అల్పాహారం తిన్నారు. ఈ భేటీతో తమ మధ్య సంబంధాలు బాగానే ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేశారు. కాగా.. బ్రేక్‌ఫాస్ట్ మీట్ అనంతరం డీకే దిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను డీకే కలవనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం సిద్ధరామయ్య ఎక్స్‌లో పోస్టు పెట్టారు. డీకే శివకుమార్‌తో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశానని, కొంతసేపు మాట్లాడుకున్నామని రాసుకొచ్చారు. అటు డీకే కూడా దీనిపై పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక ఫలప్రదమైన చర్చ జరిగిందని రాసుకొచ్చారు. ఇక, డీకేకు అనుకూలంగా నాయకత్వ మార్పులకు అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. దీనికి సంబంధించి డీకే, సిద్ధూల మధ్య రాజీ కుదిర్చేందుకు ఈ బ్రేక్‌ఫాస్ట్ మీట్ ఏర్పాటుచేసినట్లు ఉందని అభిప్రాయపడ్డాయి. ఈ మార్పులు జరిగేవరకు డీకే డిప్యూటీగానే కొనసాగుతారని వెల్లడించాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్రాల్లో ఒకటైన కర్ణాటకలో ఇలాంటి చీలికలను అధిష్ఠానం కోరుకోవడం లేదన్నారు. మరోవైపు.. దీర్ఘకాలంగా పార్టీ కోసం కృషి చేస్తున్న సిద్ధరామయ్య వంటి నాయకుడిని సీఎం సీటు నుంచి మారిస్తే.. పార్టీ భవిష్యత్తు ఎలా ఉంటుందనే దానిపై కూడా హైకమాండ్ సమాలోచన చేస్తున్నట్లు వెల్లడించాయి.



# 90 ఏళ్ల వయసులో ఎన్నికల్లో పోటీ..!

కేరళలో వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ క్రమంలో ఓ 90 ఏళ్ల వృద్ధుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగడం చర్చనీయాంశంగా మారింది. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి అయిన నారాయణ్ నాయర్‌కు 90 ఏళ్లు. ఆయన అశమన్నూర్ గ్రామ పంచాయతీ రెండో వార్డు నుంచి ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. తెల్ల చొక్కా, ధోతీ ధరించిన నారాయణ్ వణుకుతున్న స్వరంతోనే ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు కార్యకర్తలు, మద్దతుదారులతో ప్రచారాలు నిర్వహిస్తుండగా.. నారాయణ్ ఒంటరిగా ప్రజల నివాసాలకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈ వయసులో ఎన్నికల్లో పోటీకి దిగడంపై ఓ విలేకరి ప్రశ్నించగా ఆయన బదులిస్తూ.. వయసు దేనికీ అడ్డుకాదన్నారు. వార్డు అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని, ఇందుకోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. నారాయణ్ గుర్తు కెటిల్. ఈ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తాననే నమ్మకం తనకు ఉందని.. నారాయణ్ ధీమా వ్యక్తంచేశారు. ఇక, కేరళలో రెండు దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 9, 11 తేదీల్లో పోలింగ్ జరగ్గా.. 13న ఫలితాలు వెలువడనున్నాయి.

# రష్యాలో వాట్సప్‌పై నిషేధం..?

మాస్కో: ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్‌పై నిషేధం విధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రష్యా వెల్లడించింది. తమ దేశంలోని చట్టాలకు అనుగుణంగా వాట్సప్ పనిచేయడం లేదని, నేరాలను అరికట్టడంలో సహకరించడం లేదని రష్యా ప్రభుత్వం ఆరోపించింది. చట్టాలకు అనుగుణంగా సర్వీసులు లేకపోతే సంపూర్ణ నిషేధం విధిస్తామని హెచ్చరించింది. వాట్సప్‌కు ప్రత్యామ్నాయంగా యూజర్లు దేశీయ యాప్‌లను ఎంచుకోవాలని ప్రజలకు సూచించింది. ఈ విషయంపై వాట్సప్ మాతృసంస్థ మెటా స్పందిస్తూ.. యూజర్ల డేటా, కమ్యూనికేషన్‌ను సురక్షితంగా ఉంచే హక్కును ఉల్లంఘించేలా రష్యా చర్యలు తీసుకుంటుందని.. వాటిని తాము అడ్డుకుంటున్నందుకు మెసేజింగ్ యాప్‌పై నిషేధం విధించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించింది. రష్యాలో అత్యంత ప్రజాదరణ పొందిన రెండు మెసేజింగ్ సేవలలో టెలిగ్రామ్, వాట్సప్ ఉన్నాయి. దేశంలో ఉగ్రవాద, మోసపూరిత కార్యకలాపాలను పరిశీలించేందుకు వీలుగా ఈ మెసెంజర్ యాప్‌లు ప్రజల డేటాను ప్రభుత్వం యాక్సెస్ చేసేందుకు సహకరించాలని




రష్యా ప్రభుత్వం కొంతకాలంగా పట్టుబడుతోంది. ఇందులోభాగంగా వాట్సప్‌లో వినియోగదారులు కాల్స్ చేసుకోకుండా ఆగస్టులోనే నిషేధం విధించింది. ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్ ఆప్షన్ లేని దేశీయ మెసేజింగ్ యాప్ 'మాక్స్'కు మారాలని ప్రజలకు సూచించింది. అయితే ప్రజల హక్కులు కాలరాయడానికి, దేశంలోని ఉక్రెయిన్ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకోవడానికి పుతిన్ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

# ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధం.. 70 వేలు దాటిన మరణాలు

ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం మొదలైనప్పటి నుంచి మరణించిన పాలస్తీనీయన్ల సంఖ్య 70 వేలు దాటిందని హమాస్ అధీనంలోని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్ తాజాగా జరిపిన దాడుల్లో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు ఓ ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.



అక్టోబర్ 10న కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటికీ.. మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఒప్పందం ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలతో గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. వీటితోపాటు గతంలో దాడుల వల్ల శిథిలాల కింద చిక్కుకుపోయిన మృతదేహాలు బయటకు తీస్తుండడంతో మరణాల సంఖ్య పెరుగుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 70,100 మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుంచే 352 మంది మరణించినట్లు తెలిపింది.

MOVIE TIME

# వారణాసి టైటిల్ సమస్య ఎదుర్కొంటోందా?




**టాకీస్:** ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దమణిగింది.

# బాలకృష్ణ మాత్రమే ఆ పాత్ర చేయగలడు



**టాకీస్:** 'అఖండ 2' కథ చెప్పినప్పుడు తనకు గూస్‌బంప్స్ వచ్చాయని నటుడు మురళీ మోహన్ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో బాలకృష్ణ కాకుండా మరొకరు చేయలేరు అనిపించిందన్నారు. బాలకృష్ణ మాత్రమే ఈ పాత్ర చేయగలడని నిరూపించారని అన్నారు. పాత్ర అంత పవర్‌ఫుల్‌గా ఉందన్నారు. బాలకృష్ణతో 'అఖండ 2' చేస్తే అందరికీ పరమేశ్వరుడే కనిపించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగినట్లు దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. ఆయన దర్శకత్వంలో బాల కృష్ణ హీరోగా ముస్తాబైన చిత్రం 'అఖండ 2' హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేశారు. ఆ భగవంతుడే తనతో ఈ చిత్రం చేయించుకున్నాడని బోయపాటి అన్నారు.

# దుమ్మురేపుతున్న.. పేరుగల్ల పెద్దిరెడ్డి ఫోక్ సాంగ్

**టాకీస్:** తెలంగాణ జానపద గాయని, నృత్యకారిణి నాగదుర్గ నుంచి తాజాగా విడుదలైన పాట 'పేరుగల్ల పెద్దిరెడ్డి' ప్రస్తుతం యూట్యూబ్‌లో మరియు సోషల్ మీడియాలో దుమ్మురేపుతోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. శుక్రవారం విడుదలైన ఈ పాట కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌ను సాధిస్తూ



నాగదుర్గ, ఈ కొత్త పాటతో మరోసారి ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. పేరుగల్ల పెద్దిరెడ్డి అంటూ వచ్చిన ఈ పాట తండ్రి మీద ప్రేమతో కూతురు చెబుతున్న నేపథ్యంలో ఉంది. పల్లెటూరి వాతావరణాన్ని, జానపద లయను ప్రతిబింబిస్తూ ఈ పాట ఆకట్టుకుంటుంది. ఎప్పటిలాగే, నాగదుర్గ ఈ పాటలో తనదైన శైలిలో చేసిన ట్రెండింగ్‌లో నిలిచింది. ఫ్లలె జానపద పాటల అభిమానుల మధ్య ఈ పాట క్రేజీ హిట్‌గా మారడంతో నాగదుర్గ ఖాతాలో మరో విజయవంతమైన జానపద పాట చేరింది. ఈ పాటకు బుల్లెట్ బండి లక్ష్మణ్ సాహిత్యం అందించగా.. మమత రమేష్ పాడింది.




# అనుకోకుండా వచ్చిన ఆఫర్.. నా జీవితాన్నే మార్చేసింది

## కృతి శెట్టి

టాకీస్: 'ఉప్పెన' చిత్రంతో తొలి సినిమాకే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన నటి కృతి శెట్టి, తాను సినీ రంగంలోకి అనుకోకుండా ఎలా అడుగుపెట్టిందీ ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఒకప్పుడు వరుస ఆఫర్లతో దూసుకెళ్లిన ఆమె, ప్రస్తుతం ఫ్లాపులతో సతమతమవుతూ తమిళ చిత్రాలపై దృష్టి సారించారు. తన కెరీర్ ఆరంభం గురించి కృతి మాట్లాడుతూ... "నేనొక కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకి వెళ్లాను. ఆడిషన్ తర్వాత నన్ను తీసుకెళ్లడానికి నాన్న రావాల్సి ఉండగా, ఆయనకు కాస్త ఆలస్యమైంది. ఆ ఖాళీ సమయంలో పక్కనే ఉన్న మరో స్టూడియోలోకి వెళ్లాను. అక్కడ ఒక సినిమా ఆడిషన్స్ జరుగుతున్నాయి. నన్ను చూసిన యూనిట్ సభ్యులు సినిమాల్లో నటిస్తావా? అని అడిగారు. ఏం చెప్పాలో తెలియక మా అమ్మ నంబర్ ఇచ్చి వచ్చేశాను. వాళ్లు అమ్మకు ఫోన్ చేసి ఆడిషన్‌కు పిలిచారు. అలా అనుకోకుండా నాకు 'ఉప్పెన' సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అంతా ఓ కలలా జరిగిపోయింది" అని వివరించారు. 'ఉప్పెన' బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత కృతి శెట్టికి అవకాశాలు వెల్లువెత్తాయి. నానితో 'శ్యామ్ సింగ రాయ్', నాగచైతన్యతో 'బంగార్రాజు' చిత్రాలు పర్వాలేదనిపించినా, ఆ తర్వాత వచ్చిన 'ది వారియర్', 'మాచర్ల నియోజకవర్గం', 'కస్టడీ', 'మనమే' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. దీంతో ఆమె కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం కొంత గ్యాప్ తీసుకున్న కృతి, కోలీవుడ్‌లో రెండు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'వా వాతియార్', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలపై తమిళ పరిశ్రమలో మంచి అంచనాలున్నాయి. ఈ చిత్రాలతోనైనా కృతి శెట్టి తిరిగి విజయాల బాట పడుతుందేమోనని ఆమె అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ప్రభాస్ లుక్ కనిపించకుండా వంగా జాగ్రత్తలు

### ఆరు నెలలపాటు పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా రెబల్



**టాకీస్:** ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న మోస్ట్-అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'స్పిరిట్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇటీవల మొదలవ్వగా, దర్శకుడు సందీప్ వంగా ప్రభాస్ లుక్ విషయంలో అత్యంత గోప్యత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'స్పిరిట్' సినిమాలోని ప్రభాస్ పాత్ర లుక్‌ను అభిమానులకు సర్‌ప్రైజ్‌గా ఉంచాలని సందీప్ వంగా గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే, ఈ లుక్ లీక్ అవ్వకుండా ఉండేందుకు, రాబోయే ఆరు నెలల పాటు ప్రభాస్‌ని పబ్లిక్ ఈవెంట్స్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు సమాచారం. పబ్లిక్ ఈవెంట్లు, ఎయిర్‌పోర్ట్‌లలో ప్రభాస్ కనిపిస్తే, ఆయన లుక్‌ను అభిమానులు లేదా మీడియా ఫొటోలు తీసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కొన్ని నెలల పాటు ఎలాంటి ప్రచార కార్యకలాపాలు లేదా బహిరంగ కార్యక్రమాలకు హాజరు కాకూడదని ప్రభాస్, సందీప్ వంగా నిర్ణయించుకున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రభాస్ అభిమానులను కొంత నిరాశపరిచినా సందీప్ వంగా ప్రభాస్‌ను ఏ విధంగా ప్రెజెంట్ చేయబోతున్నారో చూడాలనే ఉత్సాహం మాత్రం వారిలో ఎక్కువగా ఉంది. 'స్పిరిట్' చిత్రంలో త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్, కాంచన ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# స్పిరిట్‌లో హిందీనటి కాజోల్ నటిస్తుందా?

**టాకీస్:** ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రి ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు



మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.